# సత్యస్వరూపియైన ఆత్మ మరియు సత్యము

అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. యోహాను 16:13

మీరు... సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును. యోహాను 8:31,32

థియోడర్ రెజినాల్డ్

# మొదటి విభాగము

ఈ చిన్న పుస్తకములో పరిశుద్ధాత్మ మరియు ఆయన పనిని గురించి వివరముగా వ్రాయబడలేదు గాని పరిశుద్ధాత్మను గురించి బహు తరచుగా అడిగెడి ప్రశ్నలకు పరిశుద్ధ లేఖనముల నాధారము చేసికొని జవాబులిచ్చుటకై చేసిన ఒక దీన ప్రయత్నము మాత్రమే.

## 1. ఒక వ్యక్తి ఎప్పుడు పరిశుద్ధాత్మను పొందును?

దేవుని వాక్యమును ఉపయోగించి, ఒక వ్యక్తి యొక్క పాపభరితమైన, దౌర్భాగ్య స్థితిని, దేవుని యొక్క నీతిని మరియు తీర్పును గురించి ఒప్పింప జేయుటయే పరిశుద్ధాత్మ యొక్క మొదటి ప్రాముఖ్యమైన పని (యోహాను 16:8 నుండి 11 వరకు). పరిశుద్ధాత్మ యొక్క ఒప్పుదల కార్యమునకు స్పందించి ఆ వ్యక్తి తన పాపముల విషయమై పశ్చాత్తాపపడి పాపక్షమాపణ కొరకు మరియు పాపమునుండి కడుగబడగోరినట్లయిన ఆయన దేవుని వాక్యములో నుండి ప్రభువైన యేసు క్రీస్తు యొక్క గొప్ప శ్రమలు మరణ, భూస్థాపన, పునరుత్థానములను గురించి బోధించును. మరియు పరిశుద్ధాత్మ ప్రభువైన యేసుక్రీస్తును ప్రభువు గాను, రక్షకునిగాను స్వీకరించుటకు సహాయము చేయును. ఆ రీతిగా ఒక వ్యక్తి దేవుని వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ చేత దేవుని కుటుంబములో పుట్టుచున్నాడు (యోహాను 3:5). ఎఫెసీ 5:26; 1 పేతురు 1:23 లలో చెప్పబడిన ప్రకారము నీరు, దేవుని వాక్యమునకు గుర్తుగా నున్నది. అదే క్షణములో ఆరు సంగతులు జరుగుచున్నవి.

1) ఆ వ్యక్తి పరిశుద్ధాత్మ చేత క్రీస్తు శరీరములోనికి బాప్తిస్మము పొందియున్నాడు. ప్రపంచమంతటనున్న క్రైస్తవ విశ్వాసులతో నిండియున్న సార్వత్రిక సంఘమే క్రీస్తు శరీరము (1 కొరింథీ 12:13).

2)ఆ వ్యక్తి అభిషేకము పొందుచున్నాడు (2 కొరింథీ 1:21. పరిశుద్ధాత్మ అభిషేకము, బాప్తిస్మములను గురించి వివరముగా తరువాత పేజీలలో వ్రాయబడియున్నది).

3) ఆ వ్యక్తి పరిశుద్ధాత్మ చేత ముద్రించబడియున్నాడు (2 కొరింథీ1:22; ఎఫెసీ 1:13).

4)ఆ వ్యక్తికి ఆత్మ అను సంచకరువును అనుగ్రహించియున్నాడు (2 కొరింథీ. 1:22; ఎఫెసీ 1:14).

5) ఆ వ్యక్తి యొక్క దేహము పరిశుద్ధాత్మకు ఆలయము, నివాసముగా నున్నది (1 కొరింథీ 6:19).

6) ఆ వ్యక్తి దేవునికి దత్త పుత్రుడయ్యేను. అనగా దేవుని యింటిలో ఒక వ్యక్తిగా హోదా పొందియున్నాడు (రోమా 8:15).

దత్తత అనగా ఏమో చూచెదము. ఆ దినములలో నున్న రోమీయుల ఆచార ప్రకారము వారి ఇంట పుట్టిన కుమారుని పరిపక్వత వచ్చు వరకు బానిసతో సమానముగా చూచెడివారు. దత్త స్వీకారోత్సవ సమయములో అతడు అన్ని హక్కులు, అధికృతలు గల కుమారుని అంతస్థునకు హెచ్చింపబడును. అయితే మొదటి శతాబ్దములో నున్న రోమీయులవలె గాక ఒక వ్యక్తి తిరిగి జన్మించిన క్షణముననే దత్తత వలన కలుగు అన్ని హక్కులు, అధికృతలు మన ప్రభువు అనుగ్రహించుచున్నాడు. ఇందు మూలమున ఈ క్రింద వివరించబడిన ఏడు సంగతులను అనుభవించగలుగునట్లు చేయు చున్నాడు.

1) విజయవంతమైన జీవితము (రోమా 8:13).
2) ఆత్మ నడుపుదల (రోమా 8:14; యోహాను 14:26; 1 యోహాను 2:27).
3) ప్రార్థనా జీవితము (రోమా 8:15,26).
4) సాక్ష్యమిచ్చు జీవితము (రోమా 8:16).
5) దేవుని వారసత్వము (రోమా 8:17).
6) ప్రభువుతో శ్రమననుభవించు అధికృత (రోమా 8:17).
7) మహిమను అనుభవించుట (రోమా 8:17).

ఇవియన్నియు క్రైస్తవ విశ్వాసికి తిరిగి జన్మించినప్పటి నుండియే పరిశుద్ధాత్మ శక్తి ద్వారా సాధ్యపరచ బడుచున్నవి. కనుకనే పరిశుద్ధాత్మ కొరకై వేచియుండుట లేక కనిపెట్టుట, కనిపెట్టెడి కూడికలలో పాలుపొందుట మరియు ఇతరులకు వేచియుండుమని లేక కనిపెట్టుమని బోధించుట తప్పని గ్రహించవలెను.

పరిశుద్ధాత్మ అనుగ్రహింపబడక మునుపు అపొ.కా.1:4లో కనిపెట్టుడి అని ఆజ్ఞ ఇవ్వబడినది. "తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గురించి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమ పరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు" (యోహాను 7:39). మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్మ అనుగ్రహింప బడిన తరువాత ఆయన ప్రతి విశ్వాసి యందు నివసించుచున్నాడు. "ఎవడైనను క్రీస్తు ఆత్మ లేనివాడైతే

వాడాయన వాడు కాడు"(రోమా 8:9). కనుక ప్రతి క్రైస్తవ విశ్వాసి పరిశుద్ధాత్మను కలిగియున్నాడు. ఇందులో ఎంత మాత్రమును సందేహము లేదు.

అపొస్తలుల కార్యములందలి కొన్ని వాక్యభాగములను ఇచ్చట వివరించ వలసియున్నది.

1) అపొ.కా 8:12 లో సమరయులు క్రీస్తునందు విశ్వాసముంచి, బాప్తిస్మము పొందిరి. కాని అపొ.కా. 8:17 ప్రకారము ఆ తర్వాత పరిశుద్ధాత్మను పొందిరి. మనము విశ్వాసులమైనప్పుడు పరిశుద్ధాత్మను పొందమని, బాప్తిస్మము తర్వాతనే ఆయనను పొందెదమని ఋజువుచేయుటకు అనేకులు పై రెండు వచనములను చూపించుదురు. అది వట్టి అబద్ధము. సమరయులు యూదుల యెడల ఏహ్యభావము కలిగి వారితో ఏవిధమైన సంబంధములు కలిగియుండరు. సంఘము యొక్క క్రమశిక్షణలో వారు అపొస్తలుల నాయకత్వమునకు విధేయులు కావలసియున్నది. పేతురు, యోహానులకు దేవుడనుగ్రహించిన అపొస్తలత్వమును సమరయులు ఎరిగి అంగీకరించుటకే దేవుడు ఆ రీతిగా జరిగించెను. ఇది ఒక ప్రత్యేక సందర్భము. అపొ.కా. 10:44,45 వచనములనుండి కొర్నేలీ ఇంటివారు పరిశుద్ధాత్మను పొందిన తరువాత బాప్తిస్మము పొందినట్లు గ్రహించుచున్నాము. ఒక లేఖనమును మరొక లేఖనముతో పోల్చకయే తీర్మానము చేయుట తప్పు.

2) "మీరు విశ్వసించినప్పుడు పరిశుద్ధాత్మను పొందితిరా?" అపొ.కా.19:2వ వచనమును అపార్థము చేసికొనుటద్వారా విశ్వాసిగా యుండుట మరియు పరిశుద్ధాత్మను పొందుట వేర్వేరు అనుభవములుగా భావించి అనేకులు మోసపోవుచున్నారు. అపొ.కా.19లో నున్న ఈ ప్రశ్న, బాప్తిస్మమిచ్చు యోహాను శిష్యులకు అనగా మారుమనస్సు విషయమైన బాప్తిస్మము మాత్రమే ఎరిగి యుండిన వారికి వేయబడినది. కాని వీరు ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచి ఆయనను ప్రభువుగాను, రక్షకునిగాను అంగీకరించనివారు. వీరు ప్రభువైన యేసు క్రీస్తు యొక్క శ్రమలు, మరణ భూస్థాపన, పునరుత్థానము లను ఎరుగని అవిశ్వాసులు. కనుకనే వారు ప్రభువైన యేసు క్రీస్తు నందు విశ్వాసముంచి బాప్తిస్మము పొందవలసియుండెను. ఇందుచేత పౌలు వారిని ఈ రీతిగా ప్రశ్నించవలసియుండెను.

## 2. ఆత్మపూర్ణులై యుండుట అనగానేమి?

ఎఫెసీ 5:18 లో ఆత్మపూర్ణులై యుండుడి అను ఆజ్ఞ మనకు ఇవ్వబడియున్నది. మొదటిగా ఈ నింపుదల ఒకే 'ఒక్కసారిగా నింపబడుట

మాత్రమేగాదు'. 'పూర్ణులై యుండుడి', అను మాట గ్రీకు భాషలో ఎల్లప్పుడును జరుగుచు ఉండే వర్తమాన కాలములో ఉన్నది. ఈ వచనమును 'ఎల్లప్పుడు ఆత్మతో నింపబడుచు యుండుడి' అని తర్జుమా చేయవలసి యున్నది. ఆత్మపూర్ణత ద్వారా క్రైస్తవునిలో ప్రభువునందలి ఆనందము (ఎఫెసీ. 5:19), అన్ని విషయములలో ఎల్లప్పుడు కృతజ్ఞత (ఎఫెసీ. 5:20) మరియు లోబడియుండుట (ఎఫెసీ 5:21) అనెడి సద్గుణములు కలుగును. మరియు దేవుని వాక్యము మనలో సమృద్ధిగా నివసించుటద్వారా పై సద్గుణములు మనలో కనబడునని కొలొస్స 3:16 నుండి 18 లో కూడ చూచుచున్నాము. దేవుని వాక్యముతో నింపబడి, ఆయన వాక్యమునకు విధేయత చూపించుటయే ఆత్మపూర్ణత కలిగిన జీవితమని ఋజావు చేయబడుచున్నది. "దేవుడు, తనకు విధేయులైన వారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మ" అని అపొ.కా 5:32 లో చదువుచున్నాము. దేవుని ఆత్మ సహాయముద్వారా, మన హృదయములను పరిశోధించుకొనుచు, సమస్త దీనత్వముతో దేవునితో మనుష్యులతో సంగతులు సరిజేసికొనుచు, ఏ విధమైన షరతులు లేకుండ మన సమస్తమును ఆయనకు సంపూర్ణముగా లోబరుచుకొనుచు మరియు విశ్వాసము ద్వారా పరిశుద్ధాత్మ నింపుదలను కోరుకొనుచు విశ్రాంతి, శాంతి, ఆనందము, శక్తి మరియు విజయముతో కూడిన జీవితమును జీవించుదము. నేను ఎంత పరిమాణములో పరిశుద్ధాత్మను పొందియున్నాను అను మాట కంటె నాలో ఎంత పరిమాణమును ఆయన కలిగి యున్నాడు అనునది ప్రాముఖ్యము.

విశ్వసించు మనయందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యమును మన మనోనేత్రములు వెలిగించబడుట ద్వారా ఎరుగుచున్నాము.

నీవు క్రీస్తు నందు విశ్వాసముంచినప్పుడు ఎల్లప్పుడు ఆత్మను సంపూర్ణముగా కలిగియుందువు. అప్పుడు నీవు ఎల్లప్పుడు ఆత్మకు లోబరచుకొందువు.

## 3. 'పరిశుద్ధాత్మతో బాప్తిస్మము' లేక పరిశుద్ధాత్మ బాప్తిస్మము అనగా నేమి?

పరిశుద్ధాత్మ బాప్తిస్మమును, భాషలు మాటలాడుట అను సూచనతో మనము పొందవలెనని కొంత మంది నొక్కి చెప్పుచున్నారు. సంపూర్ణ సువార్త సమాజమని తమ్మును తామే పిలుచుకొనువారు ఇతర క్రైస్తవ విశ్వాసులకు రక్షణ

మరియు నీట ముంచు బాప్తిస్మము అను రెండు అనుభవములే కలవని కించపరచుచు, తాము రక్షణ, నీటముంచు బాప్తిస్మము మరియు ఆత్మ బాప్తిస్మము కలిగియున్నాము మరియు ఇది దేవుని సంపూర్ణ సంకల్పమని చెప్పుచున్నారు. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి దేవుని వాక్యము ఏమి బయలుపరుచుచున్నదో చూచుదము. నూతన నిబంధనలో 'పరిశుద్ధాత్మ బాప్తిస్మము' అను పదము ఏడు సందర్భములలో ఉన్నది. ఈ క్రిందనున్న మత్తయి 3:11; మార్కు 1:8; లూకా 3:16; యోహాను 1:33; అపొ.కా. 1:5 ఐదు సందర్భములలో భవిష్యత్తులో జరుగు సంఘటనగా వివరించబడినది. ఎందుకనగా యోహాను 7:39 ప్రకారము పరిశుద్ధాత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు. అయితే ఆరవ స్థలము, అపొ.కా. 11:16 మరియు ఏడవ స్థలము, 1 కొరింథీ 12:13 లో ఇంతకు ముందే జరిగిన సంఘటనగా వివరించబడినది.

మనము తిరిగి జన్మించినప్పుడు ప్రభువైన యేసుక్రీస్తు పరిశుద్ధాత్మ చేత ఆయన శరీరమను సంఘములోనికి బాప్తిస్మము పొందించెను (1 కొరింథీ. 12:13). మిగిలిన ఆరు వచనములలో కూడ ఈ విధమైన పరిశుద్ధాత్మ బాప్తిస్మమును కనుగొనుచున్నాము. అనువాదము సరిగా లేనందువలననే కలవరమునకు కారణమైనది. పై ఏడు వాక్యములలోను గ్రీకు మాట "ఎన్([illegible]) ఉపయోగించబడినది. ఈ మాట మొదటి ఆరు లేఖనములలో 'తో' ([illegible])గా ఏడవ లేఖనములో 'చేత' ([illegible])గా అనువదించబడినది. ఈ ఏడు లేఖనములలోను 'చేత' ([illegible]) గా అనువదించబడవలసియున్నది. ఆ రీతిగా చేసియున్నట్లైతే ఈ కలవరము ఉండి ఉండెడిది కాదు. ప్రఖ్యాతి గాంచిన ఒక సువార్తికుడు 'పరిశుద్ధాత్మ' అను తన పుస్తకములో నాకును ఒక అనుభవము కావలెనని కోరుచున్నాను గాని ప్రతి అనుభవము బైబిలు లేఖనము మీద ఆధారపడి యుండవలెను. నాకర్థమైన బైబిలు సత్యమేమనగా, మనము రక్షింపబడినప్పుడే ఆత్మచేత క్రీస్తు యొక్క శరీరములోనికి బాప్తిస్మము పొందియున్నాము. ఇదే ఆత్మ బాప్తిస్మము. ఈ రీతిగా మనము పరిశుద్ధాత్మతో నింపబడగలము మరియు నింపబడవలెను. ఆ తర్వాత తిరిగి నింపబడవలెను మరియు సర్వ సంపూర్ణతతో నింపబడవలెను. 'ఒక్క బాప్తిస్మమే గాని అనేక మార్లు నింపబడుట' అను మాట తరచుగా చెప్పబడుచున్నది. ఈ రీతిగా నింపబడుట, రెండవ బాప్తిస్మముగా లేఖనములలో నేను కనుగొనలేదు. మరియు ఆత్మచేత నింపబడినప్పుడు భాషలతో మాట్లాడుట తప్పనిసరి అని ఏ లేఖనములలో నేను కనుగొనలేదు.

## 4. పరిశుద్ధాత్మ అభిషేకము అనగా అర్థమేమి?

నూతన నిబంధనలో 'అభిషేకము' అను మాట రెండు సార్లు మాత్రమే వ్రాయబడియున్నది. ఒకటి-2 కొరింథీ 1:21,22, రెండవది- 1 యోహాను 2:27. ఈ రెండు సందర్భములలో 'మమ్మును...అభిషేకించినవాడు' మరియు 'ఆయన వలన మీరు పొందిన అభిషేకము' అను పదములలో గతించిన కాలమును తెలియజేయు క్రియా పదము వాడబడినది. అనగా ఈ కార్యము ఇంతకముందే జరిగియున్నదని తెలియజేయుచున్నది. క్రీస్తు అనగా అభిషిక్తుడు. ఈ రెండు వాక్యభాగములలో 'క్రీస్తునందు', 'ఆయన వలన' అను మాటలు ఒక వ్యక్తి తిరిగి జన్మించి మరియు ఆత్మచేత క్రీస్తు యొక్క శరీరములోనికి బాప్తిస్మము పొందినప్పుడు సంఘము అను శరీరమునకు శిరస్సైన క్రీస్తునుండి అభిషేకము పొందియున్నాడని ఋజువు చేయుచున్నది. క్రైస్తవుడనగా క్రీస్తునందు అభిషేకించబడినవాడు.

తిరిగి జన్మించినప్పుడు పొందు పరిశుద్ధాత్మ అభిషేకమును గురించి గాక, మరల అభిషేకము పొందవలెను అని బోధించుటగాని, ప్రార్థించుటగాని లేఖనములకు విరుద్ధము.

# రెండవ విభాగము

## 5. భాషలతో మాట్లాడుటను గురించి లేఖనమేమి భోధించుచున్నది?

ఆత్మీయమైన ప్రాముఖ్య సంగతులను గురించి ఏదైనా తీర్మానములోనికి వచ్చుటకు మార్పు చెందని దేవుని వాక్యమును పరిశోధించవలెను. అంతేగాని మనుష్యులకు కలుగు అనుభవములు అవి ఎంత గొప్పవైనా సరే, సరియైనవిగా కనబడినను అవి మార్పు చెందునవి గనుక వాటిని పరిగణించకూడదు. అనుభవములు మారిపోవును గాని 'దేవుని వాక్యము నిరంతరము నిలుచును' (1 పేతురు 1:24). మరియు దేవుని వాక్యము సజీవమై నిరంతరము నిలిచియుండును. 1 పేతురు 1:23, ఒక ప్రత్యేకమైన సిద్ధాంతము (లేక బోధ). ఎంత ఆకర్షణీయముగా నున్నప్పటికిని, బహుప్రసిద్ధి చెందినప్పటికిని, గొప్ప

గొప్ప గుంపులు పొగడుచు అంగీకరించినప్పటికిని దానిని మనము సత్యమైన బోధగా ఎంచకూడదు. దేవుని వాక్యమును వన్నె చూచు రాతితో "ఆ సంగతులు అలాగున్నవో, లేవో అని పరిశీలించవలెను" (అపొ.కా. 17:11).

"వారు మిమ్మును చూచి-కర్ణపిశాచి గలవారియొద్దకు వెళ్లి విచారించుడి" అను ఈ వాక్య ప్రకారము వారు బోధించని ఎడల వారియందు వెలుగు లేదు (యెషయా 8:19,20). "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపరచు ఆత్మయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు"(1 తిమోతి 4:2).

"ఇట్టి వారికి విముఖుడవై యుండుము నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవాటి యందు నిలకడగా యుండుము"(2 తిమోతి 3:5,14).

"ప్రియులారా, ఇప్పుడు అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు. గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి"(1 యోహాను 4:1). దేవునిచేత హెచ్చరించబడిన ప్రకారము మన విశ్వాసమును వ్యక్తుల యొక్క అనుభవము మీద గాక ఎన్నడు మారని, నిరంతరము నిలిచియుండు, రాజీపడని, కల్తీలేని దేవుని వాక్యము మీదనే కట్టుకొనవలెను. భాషలు మాట్లాడుట అను విషయమును గురించి నూతన నిబంధనలో నాలుగు వాక్యభాగములు మాత్రమే ఉన్నవి. ఈ నాలుగు భాగములలో భాషలు మాటలాడుట అనగా వారు మానవులకు తెలిసిన భాషలు మాట్లాడిరి. అంతేగాని అర్థములేని మాటలు మాటి మాటికి, బహు వేగముగా, ఉల్లాసముగా పలుకుట గాదు. ఈ నాలుగు వాక్యభాగములలో మూలభాషయైన గ్రీకులో తెలియబడని (అన్‌నోన్) అను మాట కనబడనే కనబడదు. అనువాదకులు ఈ మాటను కలిపిరి. అందువలననే ఇంగ్లీషు భాషలో కింగ్‌జేమ్స్ అనువాదములో అన్ నోన్ అను మాట ఇటాలిక్స్‌లో ఉన్నది. మనము ఒకదాని వెంట ఒకటి ఈ లేఖన భాగములను చూచెదము.

1) అపొ.కా. 2:1 నుండి 11. నాలుగవ వచనములో అన్యభాషలు అనగా ఆయా ప్రజలు మాట్లాడు వాడుక భాషలు. 9 నుండి 11వ వచనము వరకు 16 భాషలు మాట్లాడు గుంపులు ఉన్నట్లుగాను, వీరు వారి వారి స్వభాషలలో దేవుని కార్యములు

వినినట్లుగా గ్రహించుచున్నాము. కనుక పెంతెకొస్తు దినమున మాట్లాడిన భాషలు దేవదూతల భాషలు కావు, పరలోక భాషలు కావు, అర్థము లేని బహు తరచుగా ఉచ్ఛరించు పదములు కావు. పెంతెకొస్తు దినమున శిష్యులు మాట్లాడిన భాషలు వాస్తవమైనవి, గుర్తింప బడినవి మరియు వినిన వారికి అర్థమగు భాషలు.

2) అపో.కా. 10:46. ఈ వచనములో మాట్లాడిన భాషలను పేతురుతో పాటు వచ్చినవారు కూడ గ్రహించ గలిగిరి మరియు వారు దేవుని ఘనపరచుచున్నట్లు వినినవారు చెప్ప గలిగిరి. ఇచ్చట కూడ గ్రహింపలేని భాషలు కాదు.

3) అపో.కా. 19:6. ఇచ్చట కూడ మాట్లాడిన భాషలు అనగా మానవులు మాట్లాడే వాడుక భాషలే. ఆదిమ గ్రీకు భాషలలో అపో.కా 10:46 లో వాడిన పదము కూడ ఇదే.

4) 1 కొరింథీ 12:13,14. కొరింథు సంఘములో కూడ భూసంబంధమైన, వాస్తవమైన, వాడుక భాషలే 'భాషలు'(టంగ్స్)గా పిలువబడినవి. ; 'గ్లొస్సా' అను గ్రీకు పదము 'భాషలుగా' అనువదింపబడినది. ఈ పదమే గ్రీకు భాషలో యున్న పాత నిబంధనలోఇదే అర్థమిచ్చునట్లుగా 33 సార్లు ఉపయోగించబడినది.

కొరింథు పట్టణము విగ్రహారాధనతో, దుర్నీతితో నింపబడియున్నది. అన్యదేవతారాధన యందు 'ప్రవక్తలు' దయ్యమువలన పూనకము వచ్చి ఏవేవో మాటలు మాటి మాటికి ఉచ్ఛరించుదురు. ఈ అన్యజనుల ఆచార పద్ధతినే కొరింథులో నున్న సంఘములు అదుపు లేకుండా భాషలు అనే పేరుతో మాట్లాడుచు వచ్చిరి. అపొస్తలుడైన పౌలు కొరింథు సంఘములోనున్న ఈ కలవరము విషయమై ఎంతో భారము కలిగి, సంఘములో క్రమశిక్షణ, క్రమమును తీసికొనరాగోరెను.

సమస్తము క్రమముగాను, మర్యాదగాను జరిగించవలెనని పౌలు (1 కొరింథీ 14:4) ఈ మూడు అధ్యాయములు వ్రాసెను. భాషలు మాట్లాడుటను క్రమపరచుటకు ఈ క్రింది నియమములను వారి ముందుంచి యున్నాడు.

1. మనము పై భాగములలో పేర్కొనబడినట్లుగా భూమి మీద మానవులు మాట్లాడే ఒక భాషయే వారు మాట్లాడిరి (1 కొరింథీ 14:8 నుండి 12) (ఈ దినములలో కొన్ని క్రైస్తవ సమాజములలో మాట్లాడే భాషలు ఎరుగనివి). ఏ మాత్రము అర్థము లేనివిగాను, వేగముగా ఒకే పదమును మాటి మాటికి పెద్దగా

ఉచ్చరించెడివిగానే ఉన్నవి గాని భూమి మీద తెలిసిన భాష గాదు. భాషా ప్రవీణులైన విలియమ్ ఇ. విల్‌మర్స్ వంటివారు భాషలు మాట్లాడువారిని పరీక్షించి ఈ భాషలు మానవులు మాట్లాడేవి కావని, ప్రపంచములో ఏ భాగములో కూడ మాట్లాడరని చెప్పిరి. కొన్ని క్రైస్తవ సంఘములలో భాషలు మాట్లాడు వారికి అర్థము చెప్పువారు ఒకే పదమునకు లేక కొన్ని పదములకు వేర్వేరు అర్థములు చెప్పుచున్నారు. ఈ దినములలో మాట్లాడే 'భాషలు' దేవుని వాక్యములో చెప్పబడిన మొదటి నియమమునకు విరుద్ధముగా నున్నది.

2. 'భాషలు' అవిశ్వాసులకు సూచకముగా నున్నది (1 కొరింథీ 14:21,22; యెషయా 28:11,12).

3. 'భాషలు' వ్యక్తిగత ప్రయోజనము కొరకు గాక అందరి ప్రయోజనము కొరకు ఉపయోగించవలెను (1 కొరింథీ 12:7; 14:12). (1 కొరింథీ 12:7లో నున్న 'సుంఫెరో' అను గ్రీకు పదమునకు అర్థము అందరి ప్రయోజనము గాని వ్యక్తిగత ప్రయోజనము కాదు).

4. అర్థము చెప్పువాడు లేని ఎడల మాట్లాడకూడదు (1 కొరింథీ 14:28).

5. ముగ్గురికి మించకుండా ఉండవలెను (1కొరింథీ 14:27).

6. ఒకరి తరువాత ఒకరు వంతులుగా మాట్లాడవలెను గాని అందరు ఒకేసారి కలిసి మాట్లాడకూడదు (1 కొరింథీ 14:27) ( ఈ దినములలో కనబడుచున్నట్లుగా ఒకరితో ఒకరు పోటీ పడుచు, కలసి కట్టుగా కేకలు వేయుచు సంఘములో కలవరము, ఉద్రేకము, రెచ్చగొట్టుటకాదు).

7. ఒకడు అర్థము చెప్పవలెను (1కొరింథీ 14:27) (భాషలు మాట్లాడు కూడికలలో ఒకనికి అనేకులు అర్థము చెప్పుచున్నారు).

8. స్త్రీలు మౌనముగా యుండవలెను. పురుషులు మాత్రమే మాట్లాడవలెను. (1 కొరింథీ 14:34) (తెలియని భాషలు మాట్లాడు కూడికలలో స్త్రీలు ఎక్కువగా ఈ భాషలు మాటలాడుచున్నారు).

9. మాట్లాడు భాషను సమాజము గ్రహించకపోతే మౌనముగా ఉండుట మంచిది (1 కొరింథీ 14:18,19).

10. క్రమముగాను మర్యాదగాను జరుగవలెను (1 కొరింథీ 14:40) (శరీరము మీదనున్న వస్త్రములు తొలగిపోవునట్లుగా గంతులు వేయుట, అసభ్యకరమైన విధానములలో పడిపోవుట ఏ మాత్రము దైవ లేఖనాను సారము కాదు).

ఈ దినములలో భాషలు మాట్లాడు గుంపులలో పైన చెప్పబడిన నియమములు ఏమైనా నెరవేరుచున్నవేమో దయచేసి నిజాయితీగా మంచి మనస్సుతో పరిశీలించుడి. విచారకరమైన సంగతేమనగా పైన చెప్పబడిన నియమములు పాటించే ఒక గుంపు కూడ మనకు కనబడదు.

'తెలియని భాషలతో' కూడిన సూచన వలన మనము పరిశుద్ధాత్మను పొందవలెనని కొంత మంది బోధించుచున్నారు. ఈ క్రింద ఉదహరించిన లేఖనములను జాగ్రత్తగా పరిశీలించెదము. అపొ.కా.2వ అధ్యాయములో క్రీస్తు ప్రభువు యొక్క పునరుత్థానమునకు 50 రోజులు తరువాత దేవుని ప్రత్యక్షతలు సంఘ యుగములో అన్యజాతి వారికి కూడ అనుగ్రహించబడిన సంగతి వారి వారి భాషలలో పామరులైన వారి ద్వారా వాస్తవమైన భాషలలో వివరించబడినవి. అంతకు ముందు ఏర్పరచబడిన ఇశ్రాయేలు జాతికి హెబ్రీ భాషలో మాత్రమే దేవుని ప్రత్యక్షతలు బయలు పరచబడినవి.

ఏడు సం॥లు గడచిన తరువాత అపొ.కా. 10వ అధ్యాయములో కొర్నేలీ ఇంట కూడియున్న వారందరు అన్యజాతి వారుగా చూచుచున్నాము. అన్యజాతివారు సంఘములో భాగమైయున్నారని, యూదులతో సమానమైన వారని పేతురును, మరియు ఆయనతో వెళ్లిన యూదా క్రైస్తవులును వెంటనే అంగీకరించవలెనని దేవుడు కోరియున్నాడు. యూదులతో సమానముగా వారిని దేవుడు అంగీకరించెనని తెలియజేయుటకు వారికి భాషలను సూచనగా ఇచ్చియున్నందున శిష్యులు "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు" అని చెప్పగలిగిరి. మరి 13 సం॥ల తరువాత అపొ.కా. 19వ అధ్యాయములో యెరూషలేమునకు దూరముగా నున్న ఎఫెసులోని ప్రజలకు ఇదే సూచన అనుగ్రహించుట ద్వారా అన్యజనుల ఎడల పౌలు యొక్క అపొస్తలత్వము దేవుడు అంగీకరించెనని తెలియజేసెను. మరి రెండు సం॥ల తరువాత కొరింథు సంఘములో అన్యాచారములననుసరించి భాషలు మాట్లాడు విధానమును పౌలు గద్దించి సంఘములో కలవరము కలుగకుండునట్లు వారిని నివారించవలసి వచ్చెను.

1కొరింథీ 13:8 నుండి 13 లలో భాషలు నిలిచిపోవును అని చూచు చున్నాము. మొదటి శతాబ్దము వరకు సంఘమునకు దేవుని సంకల్పములు బయలు పరచుటకు ప్రవచనము, భాషలు మరియు జ్ఞానము అవసరమై యున్నది. ప్రకటన గ్రంథము పూర్తియైన తరువాత ఈ మూడింటి అవసరత

లేదు. నూతన నిబంధన ముగిసిన తరువాత దేవుడు, వ్రాయబడిన తన వాక్యముద్వారా మాటలాడును. 1కొరింథీ 13:8 ప్రకారము ప్రవచనము మరియు దేవుని ప్రత్యక్షతలను గూర్చిన జ్ఞానము అకస్మాత్తుగా (గ్రీకులో కధరేగో) నిలిచిపోవును. అయితే అదే భాగములో భాషలు నిదానముగా నిలిచిపోవును (గ్రీకులో పానో అని చదువుదుము). అందువలననే 1 కొరింథీ పత్రిక వరకు భాషలను గురించి వినుచున్నాము. ఆ తర్వాత ఇంకెక్కడ కనబడవు. ఎఫెసీ. ఫిలిప్పీ ఇంకా మిగిలిన పత్రికలలో భాషలను గురించిన ప్రస్తావన ఒక్కసారి కూడ లేదు. రోమా 12:4, నుండి 8; ఎఫెసీ 4:8 నుండి 13 వరకు నున్న వరముల జాబితాలో భాషలను గురించి ఒక్కసారి కూడ లేదు. నాలుగవ శతాబ్దములో నివసించిన అగస్టీన్ మరియు క్రిసోస్టమ్ అను భక్తులు భాషలు అప్పటికే నిలిచిపోయినవని చెప్పిరి. అపొస్తలుల కార్యముల పుస్తకములో గుంపులోని అందరు భాషలు మాట్లాడిరి. కాని కొరింథీ సంఘములో కొద్ది మందే భాషలు మాట్లాడిరి (1 కొరింథీ 12:30). కావున భాషలు నిదానముగా మాయమైనట్లు (పావో) మనము స్పష్టముగా చూచుచున్నాము.

జాన్‌మెక్ ఆర్థర్ అను గొప్ప బైబిలు పండితుడు 'ది ట్రూత్ ఎబౌట్ టంగ్స్- వర్డ్ ఆఫ్ గ్రేస్ 1984, 10వ పేజీలో ఈ రీతిగా వ్రాసియున్నాడు. "భాషల విషయమై ఏడు సం॥లు పరిశ్రమించి అచ్చులో నున్న అనేక పుస్తకములను చదివి, భాషలు మాట్లాడే గుంపులతో అనేక గంటల కొలది చర్చించి వారి దృక్పథముతో సరితూచిన తరువాత ఏ అనుమానము లేకుండ 1900 సం॥ల క్రితమే అపొస్తలుల కాలములోనే భాషలు నిలిచి పోయినవని నేను ఒప్పించ బడితిని.

మధురైలో ఒక సువార్తికుడు ...ఒకప్పుడు నేను భాషలు మాట్లాడితిని. కూడికలలో జబ్బుతో యున్నవారిని పేరు పెట్టి పిలిచెడివాడను. పరిశుద్ధ గ్రంథమును ప్రార్థనా పూర్వకముగా, లోతైన విధానములో చదివిన తరువాత ఈ 'అనుభవము' దేవుని వలన కాదని ఎరిగి వాటిని అప్పటి నుండి విడచిపెట్టితిని.

విచారకరమైన సంగతేమనగా కొంతమంది పరిశుద్ధాత్మతో నింపబడిన దానికి భాషలు మాట్లాడుట ఒకే ఒక సూచన అని, ప్రతి ఒక్కరు దాని కొరకు వెదకవలెనని బోధించుచున్నారు. అయితే గొప్ప దైవజనులైన లూథర్, కాల్విన్, వెస్లీ, వైట్‌ఫీల్డ్, జాన్‌నాక్స్, స్పర్జన్, ఫిన్నీ, మూడీ, టోరీబిల్లీ సండే, విలియమ్ కేరీ,

భక్తసింగ్, బిల్లీగ్రహామ్, మరియు జాన్ ఆర్ రైస్‌లు ఎన్నడును భాషలు మాట్లాడ లేదు. పరిశుద్ధాత్మతో నింపబడుటకు భాసలు మాట్లాడుటయే సూచన. అయితే భాషలు మాట్లాడని వీరు పరిశుద్ధాత్మతో నింపబడియుండలేదు. ఇది ఎంత హాస్యాస్పదము! 1 కొరింథీ 12:30 లో పౌలు ఈ వరమును చివరిదిగా వర్గీకరించియున్నాడు. 1 కొరింథీ 13:11 లో ఈ విషయమును పిల్ల చేష్టగా వ్రాసియున్నాడు. కొరింథు సంఘము శరీరానుసారమైనదై, కోర్టుకేసులు, అపొస్తలుల అధికారమును ఎదిరించుట, బహిరంగమైన నీచ పాపములు, త్రాగుడు, ప్రభుబల్ల అయోగ్యముగా ఆచరణ, తప్పుడు సిద్ధాంతములు మరియు విబేధములతో నిండియుండెను. నూతన నిబంధనలో భాషలు మాట్లాడిన ఒకే ఒక సంఘమైన కొరింథు సంఘము ఇన్ని పతనములతో నింపబడియుండగా భాషలతో మాట్లాడుట అన్నిటికంటె గొప్ప వరమని, ప్రతి ఒక్కరు దానిని వెదుకవలెనని ఏ రీతిగా చెప్పగలము?

పరిశైన గ్రహింపుతో కొన్ని లేఖన భాగములను మనము ఎరుగవలసి యున్నది. 1కొరింథీ 14:4లో భాషతో మాట్లాడువాడు తనకు తాను క్షేమాభివృద్ధి కలుగజేసికొనుచున్నాడు. భాషతో మాట్లాడుట మెచ్చుకొనదగినదిగా గాక ప్రవచించుటతో పోల్చుటకై చెప్పబడియున్నది. సంఘక్షేమాభివృద్ధికై వరములు ఇవ్వబడియుండగా ఆ వరములతో సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగజేయవలెనే గాని ఆ వ్యక్తి ఘనత కొరకు కాదు. మనస్సు ఫల భరితము గాని భాషతో చేయు ప్రార్థనను అపొస్తలుడైన పౌలు ప్రోత్సహించుటలేదు గాని మనస్సుతో కూడ ప్రార్థన చేతునని చెప్పుచున్నాడు (1 కొరింథీ 14:14,15). కావున 'భాషలు' ప్రార్థనా భాష కాదు' రెండవదిగా 1 కొరింథీ 14:5 లో "పౌలు మీరందరు భాషలతో మాట్లాడకోరుచున్నానని (ప్రజలు మాట్లాడు వాస్తవమైన భాషలు) చెప్పుచున్నాడు. 1 కొరింథీ 12:30లో అందరు భాషలతో మాట్లాడుచున్నారా? అని చెప్పి దానికి విరుద్ధముగా మీరందరు భాషతో మాట్లాడవలెనని కోరుచున్నానని ఏ రీతిగా చెప్పగలుగును? పౌలు ఆయా భాషలు మాట్లాడువారికి వారి వారి భాషలలో సువార్త చెప్పుచున్నట్లు ఇతర విశ్వాసులు కూడ ఆ రీతిగా సువార్త చెప్పవలెనని ఆయన వ్యక్తిగత కోరిక. "నేను మీయందరికంటె ఎక్కువగా భాషలతో మాట్లాడుచున్నాను. అందుకు దేవుని స్తుతించెదను" (1 కొరింథీ 14:18). ఇలాంటి తలంపునే 1కొరింథీ 7:7లో కూడ "మనుష్యులందరు నావలె

ఉండగోరుచున్నాను" అని తెలియజేయుచున్నాడు. అందరు తనవలెనే పెండ్లి లేక యుండవలెనను తన వ్యక్తిగత కోరికను తెలియజేయుచున్నాడు. "కాని ప్రతి మనుష్యుడు తనకున్న కృపావరమును దేవుని వలన పొందియున్నాడు" అని చెప్పుచున్నాడు (పెండ్లి చేసికొనుట లేక పెండ్లి లేక యుండుట). కనుక ఇది అనుసరించుట కొరకైన ఉపదేశము కాదు. 1కొరింథీ 14:39లో భాషలతో మాటలాడుట ఆటంకపరచకుడని పౌలు వ్రాయుచున్నాడు. ఎందుకనగా క్రొత్తనిబంధన గ్రంథము అప్పటికి పూర్తి కాలేదు మరియు దేవుని ప్రత్యక్షత యూదుల భాషలోగాని అన్యుల భాషలో గాని అవసరమైయున్నది. క్రొత్త నిబంధన పూర్తియైన తరువాత ఇది అవసరములేదు.

మనము కల్పించిన కృత్రిమమైన నకిలీ అనుభవములను గురించి జాగ్రత్తగా యుండవలెను. మనుష్యులలో ఉన్న ప్రాణశక్తి (సోల్‌పవర్) అతనిలో యున్న మనస్సులో (సబ్‌కాన్షియస్ సెల్ఫ్) దాచబడియున్నది. ఈ శక్తిని ఉపయోగించి మెస్మరిజమ్ చేయువారు (ఇంద్రజాలికులు) మరియు సెల్‌మానిస్ట్ అనేక అద్భుతములు చేయుచున్నారు. ఈ విధముగానే కెరిస్మాటిక్ గుంపు వారు వేగముగా చప్పట్లు కొట్టుట త్వరితముగా పాటపాడుట, ఎక్కువ శబ్దముతో డప్పులు వాయించుట, హల్లెలూయా, గ్లోరి (మహిమ) అను పదములు మాటి మాటికి ఉచ్చరించుట మొదలగు వాటిని చేయుట ద్వారా ప్రజలను స్పృహలోనికి తీసికొని వచ్చుచున్నారు. ఇతరులు ప్రార్థించుచున్నప్పుడు లేక పాడుచున్నప్పుడు మధ్యలో తమాషాగా పెద్ద కేకవేయుట లేక గొణుగులు చేసి అర్థవంతమైన స్థితినుండి సబ్‌కాన్షియస్ సెల్ఫ్‌యొక్క అదుపులో ఉద్రేకపూరితమైన కేకలలోనికి మనుష్యులను దారితప్పించుచున్నారు. ఉద్రేకభరితమైన కార్యములు అనగా భాషలతో మాట్లాడుట మొదలగు కార్యములు చేసినప్పుడు మానసికమైన సంతోషము, తాత్కాలికమైన ఉల్లాసము పొంది అది దేవుని కార్యమని తలంచుచున్నారు.

క్రైస్తవేతరులు, అన్యులైన వారు కూడ భాషలు మాట్లాడుచున్నారని ఎరుగుట ఆశ్చర్యముగా నున్నది. డి.సి గ్రహమ్ గారు చైనాలో భాషలు మాట్లాడు ఒక అమ్మాయిని కలిసితినని చెప్పిరి. తూర్పు ఆఫ్రికాలో సువార్త సేవలో ప్రయాసపడిన ఎడ్వర్డ్ లాంగ్టన్, అపవిత్రాత్మలచే ఆవరించబడిన గ్రూపు వారు భాషలు మాట్లాడుట వినియున్నారు. లండన్‌లోని ఒక సంఘములో ఒకరు చైనా భాషను మరియొకరు అరబిక్ భాషను మాటలాడిరి. అయితే ఆ సంఘములో ఈ

భాషలు తెలిసిన వ్యక్తులు భాషలు మాటలాడిన వ్యక్తులు దేవదూషణకరమైన నీచ పదములు మాటలాడినట్లు చెప్పిరి. చెన్నై (మద్రాస్)లో యున్న ఒక సంఘమునకు ముగ్గురు హైందవ స్త్రీలు, మరొక స్త్రీని తీసికొని వచ్చి, అయ్యా ఈమె, కెరిస్ మాటిక్ మీటింగుకు వెళ్లి భాషలు మాట్లాడుచున్నదని చెప్పిరి. ఆ భాష తెలిసిన మా పొరుగువారు విని ఆమె మాటలాడు భాష నీచమైన పదములని దేవదూషణ కరమైన మాటలని చెప్పిరి. దయచేసి ఆమె కొరకు ప్రార్థించుమని కోరిరి. మేము ప్రార్థించగా ఆమెలో నున్న అపవిత్రాత్మ పెద్ద కేక వేసి ఆమెను విడచి వెళ్లినది. దేవుని అద్భుత ఉచిత కృపావరమైన రక్షణను పొందక, ఆ స్త్రీ వెలుగు దూత వేషములో వచ్చిన దుష్టుని చేతిలో పడి ఏవో కొన్ని ఉద్రేకపూరితమైన అనుభవము పొందినది. ఎంత విచారకరమైన సంగతి!

.....భాషతో పదివేల మాటలు పలుకుటకంటె ఇతరులకు బోధకలుగునట్లు నా మనస్సుతో ఐదు మాటలు పలుకుట మేలు (1 కొరింథీ 14:19).

# మూడవ విభాగము

## 1. స్వస్థత కూటములు లేఖనానుసారమా?

సి.ఐ.స్కోఫీల్డ్ అనునతడు సూచనలు, మహత్కార్యములు ఒక ప్రత్యేక కాలము వరకు మాత్రమే పరిమితమని చెప్పిరి. దేవుడు తన ప్రజలను ఐగుప్తులోనుండి బయటికి తెచ్చుటకు చేసిన మహత్కార్యములు, అరణ్య ప్రయాణములో, అవసరములేదు. ఇశ్రాయేలీయులు యొర్దానును దాటిన తరువాత అరణ్య ప్రయాణములో మహత్కార్యములు నిలిచిపోయినవి. ఇశ్రాయేలీయులు అగ్ని స్తంభము, మేఘ స్తంభము కనానులో కూడ కావలెనని ప్రార్థించిన ఎడల అది దేవుని చిత్తమునకు వ్యతిరేకముగా ఉండును.

దేవుడు ప్రతి ఒక్కరిని స్వస్థపరచునను తీర్మానముతో, ఈ దినములలో జరిగించు స్వస్థత కూటములు లేఖానాను సారమైనవి కావు. అపొ.కా. 5:16 లో అందరు స్వస్థత పొందిరి (క్రీ.శ 35). అయితే దేవుడు ఏర్పరచుకొనిన తన సేవకులైన ఫిలిప్పీ 2:25 నుండి 28లలో వ్రాయబడిన ఎపఫ్రొదితు (క్రీ.శ 60), 2 తిమోతి 4:20లో యున్న త్రోఫిము (క్రీ.శ 67), 2 కొరింథీ 12:8,9లలో వ్రాయబడియున్న పౌలు కూడ స్వస్థత పొందలేదు. దీనిని బట్టి స్వస్థపరచుటకు

దేవుని శక్తి లేక ఆయన కోరిక సన్నగిల్లినదని అర్థము కాదు. కాని గుంపులు గుంపులుగా స్వస్థత పొందవలెనని కోరకూడదు. రోగియైన విశ్వాసి సంఘ పెద్దలను పిలిపించవలెను. వారు నూనె రాచి ప్రభువు నామమున ప్రార్థింపవలెనని యాకోబు 5:14,15 లలో లేఖనము హెచ్చరించుచున్నది. లేఖనమునకు విరుద్ధమైన స్వస్థత కూటములు జరిగించుట లేక ప్రోత్సహించుట యందు మనము పాలుపొందక యుందము.

## 2. పరిశుద్ధాత్మతోను మరియు అగ్నితోను బాప్తిస్మము పొందుట అనగా అర్థమేమి?

మత్తయి 3:11 మరియు లూకా 3:16 లో "ఆయన పరిశుద్ధాత్మతోను, అగ్నితోను భాప్తిస్మమిచ్చును" అని చదువుచున్నాము. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గురించి ఇంతకు మునుపే చూచియున్నాము. "ఇప్పుడు అగ్నితో బాప్తిస్మము" అను వచనమును అనేకులు అపార్థము చేసికొని, తప్పుగా వివరించి మనము అగ్ని బాప్తిస్మము కొరకై ప్రార్థించి, పొందవలెనని నొక్కి చెప్పుచున్నారు. లేఖనముల ప్రకారము అగ్ని బాప్తిస్మము దేవుని తీర్పుగా నున్నది. తరువాత వచనము మత్తయి 3:12, లూకా 3:17లను చూచిన అవి తీర్పును గురించి మాట్లాడుచున్నవి. లూకా 12:49,50లలో ఈ సంగతిని మరల చదువుచున్నాము. ఇచ్చట ప్రభువైన యేసు క్రీస్తు ఈ లోకమునకు రాబోవు తీర్పును గురించి మరియు తన మీదకు తాను తీసికొను పాపపు, తీర్పు గురించి మాటలాడుచున్నాడు. ఈ విషయమునే మలాకీ 4:1 లోను మరియు 2 థెస్స 1:7,8లలోను చదువుచున్నాము. ఆయన విశ్వాసులను పరిశుద్ధాత్మ చేత సంఘమను క్రీస్తు శరీరములోనికి, అవిశ్వాసులను అగ్ని తీర్పులోనికి బాప్తిస్మమిచ్చును. అపొ.కా 2:3లో అగ్ని జ్వాలల వంటి విభాగింపబడిన నాలుకలు (అగ్ని కాదు అగ్ని వంటి) అగ్నితో పోల్చబడిన (యిర్మీయా 20:9; 23:29) దేవుని వాక్యమును చూపించు చున్నది. విభాగింపబడిన అను మాటకు దేవుని వాక్యము యూదులకును యూదేతరులకును చెందినదని అర్థము. ఇదే తలంపును హెబ్రీ. 4:12 లో రెండంచులు గల ఖడ్గముగా కనుగొనుచున్నాము. కొంతమంది వ్యక్తుల అనుభవమును బట్టి, దేవుని వాక్యమునకు భిన్నముగా వెళ్లలేము. కావున అగ్ని బాప్తిస్మము అవిశ్వాసుల మీదికి దిగివచ్చు దేవుని తీర్పుగా యున్నది.

## 3.ప్రవక్తలుగా పిలువబడువారు భవిష్యత్తును గురించి చెప్పుట లేఖనానుసారమా?

క్రైస్తవులు కానివారు (అన్యులు) సోదె చెప్పు వారి యొద్దకు, భవిష్యత్తును గురించి చెప్పువారి యొద్దకు వెళ్లునట్లుగా, దేవుని వాక్యములో నాటబడని కొందరు విశ్వాసులని పిలువబడుచు ప్రవక్తలు, ప్రవక్త్రిలు అని పిలువబడువారి యొద్దకు వెళ్లుచున్నారు. ప్రభువు తన పిల్లలను దేవుని వాక్యము ద్వారా నడిపించుటకు ఆయన తన పరిశుద్ధాత్మను అనుగ్రహించెను. దేవుని నడిపింపును ఎరుగుట ప్రతి విశ్వాసికి అనుగ్రహింపబడిన ఆధిక్యతగా యున్నది (కీర్తన 32:8). ప్రవక్తలు మరియు దీర్ఘ దర్శులు అని పిలువబడు వారిని వెంబడించి అనేకులు విశ్వాస విషయమై ఓడ బద్దలై పోయినవారుగా ఉన్నారు. అనేకులు "వారు ఇవన్నియు యేసు నామములో జరిగించుట లేదా" అని ప్రశ్నించుచున్నారు. మన ప్రభువైన యేసు క్రీస్తు చెప్పిన ఈ మాటలు శ్రద్ధగా గ్రహించుడి. ' ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీనామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను? అక్రమము చేయువారలారా నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి 7:22,23).

1తిమోతి 4:1,2లలో ఈ అబద్ధ బోధకులు సాతానుచే శక్తి పొందెదరని పౌలు స్పష్టముగా చెప్పుచున్నాడు. మరియు ఈ విషయములలో పాల్గొనుట బహు ప్రమాదకరమైనది. ఆత్మీయతనుండి ఉద్రేకములోనికి శాశ్వతమైనవాటి నుండి తాత్కాలికమైనవాటి యొద్దకు, యేసుక్రీస్తు యొద్ద నుండి ఆ బోధకుల వైపునకు వారికే మహిమ, ప్రాముఖ్యత కలుగునట్లుగా మనలను దారి మళ్లించునట్లు అబద్ధ బోధకులు పనిచేయుచున్నారు. అనేకమంది బలహీనులైన ప్రజలు ఈ క్షుద్ర దేవతల (వ్యక్తులు) యొక్క మోసమునకు బలియై ఆ బలహీనుల ద్వారా ఆస్తి పాస్తులు సంపాదించుకొనుచున్నారు. సాతాను యొక్క అట్టి తంత్రము, మోసములనుండి మన ప్రియ ప్రభువు మనలను కాపాడును గాక! మన ప్రియమైన యేసు క్రీస్తు మీదనే మన దృష్టి, మనస్సు కేంద్రీకరించబడును గాక!

"కీడుగా కనబడు ప్రతిదానికి దూరముగా ఉండుడి" (2 థెస్స 5:22).

"హితవాక్యప్రమాణమును గైకొనుము" (2 తిమోతి 1:13).

గమనిక :

ఎంతో హద్దుబాటు, పరిమితులతో పైనున్న ప్రాముఖ్యమైన సత్యములను మీకు వివరించిన తరువాత, ఒక వేళ నీకు గనుక రక్షణ నిశ్చయత లేదా నూతన జన్మ అనుభవం లేనట్లయితే, అవన్నియు నీకు సంబంధం లేని మరియు అనవసరమైన విషయములని దయచేసి మీరు గమనించగలరు. ప్రభువైన యేసు క్రీస్తు సిలువమీద నీ పాపములకు రావలసిన శిక్షను ఆయనే పొందెను అని నమ్ముచు, ప్రార్థనలో మీ పాప జీవితమును గూర్చి పశ్చాత్తాప పడుచు, ఉన్నపాటున ఆయన యొద్దకు తప్పకుండ రావలెను (యెషయా:53:5) నిన్ను క్షమించమని, నీ హృదయంలోనికి రమ్మని మరియు ఆయన ప్రశస్త రక్తముతో మీ ప్రతి పాపమును పవిత్ర పరచమని ఆయనను అడుగుము (1యోహాను:1:7,9). నిన్ను క్షమించుటకు మీ అపరాధములను క్షమించుటకు ప్రభువైన యేసు క్రీస్తు రక్తమునకు శక్తి కలదు (ఎఫెస్సి:1:7) మీ జీవితమును ఆయనకు అర్పించుము. ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చాడని నమ్ముము (ప్రకటన:3:20). ఆయన కొరకే జీవించుము మరియు ఆయన కొరకే ప్రయాసపడుము. నీవు గనుక ఈ తీర్మానము చేసికొన్నచో దయచేసి మాకు తెలియజేయుము.